


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 02-04-2026 | సంపుటి - 27 | సంచిక -310 | రూ : 4 | పేజీలు: 8





## మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు

- సేవలన్నింటిపై 18 శాతం జీఎస్టీ
- ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం
- తక్షణమే అమల్లోకి రానున్న ప్రభుత్వ ఉత్తర్వులు

2లో

### హనుమాన్ జయంతి

## నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు..

- హైదరాబాద్‌లో నేడు హనుమాన్ జయంతి విజయయాత్ర
- నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్లింపు
- గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు కొనసాగనున్న ర్యాలీ
- మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాల మూసివేత

2లో





### ఎల్పీజీ సెగ

## హైవేపై ట్రాఫిక్ జామ్

- హైదరాబాద్‌లో తీవ్రమైన ఎల్పీజీ గ్యాస్ కొరత
- రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు
- నగరంలో పలుచోట్ల భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



2లో



### టికెట్ క్యాన్సిలేషన్

## ప్రయాణికులకు షాక్!

- రైల్వే టికెట్ రద్దు, రిఫండ్ నిబంధనల్లో కీలక మార్పులు
- రైలు బయల్దేరడానికి 8 గంటలలోపు రద్దు చేస్తే రిఫండ్ సున్నా
- 8 నుంచి 24 గంటల మధ్య రద్దుకు టికెట్ ధరలో 50 శాతం కోత
- ఏజెంట్ల దందాకు చెక్ పెట్టేందుకే ఈ కొత్త విధానం
- ఏప్రిల్ 1 నుంచి దశలవారీగా దేశవ్యాప్తంగా అమలు

2లో

### చండీగఢ్ బీజేపీ ఆఫీస్ వద్ద

## భారీ పేలుడు..

- పార్క్ చేసి ఉంచిన స్కూటీలో పేలుడు
- సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు బృందాలు, అగ్నిమాపక సిబ్బంది
- భారీ మొత్తంలో నష్టం జరగలేదన్న బీజేపీ నాయకులు



2లో

### అమరావతి చట్టబద్ధత బిల్లుకు

## తెలంగాణ బీజేపీ మద్దతు: కిషన్ రెడ్డి

- లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ
- సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందన్న కిషన్ రెడ్డి
- కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని వ్యాఖ్య
- విభజన తర్వాత రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలన్న కిషన్ రెడ్డి

2లో




## విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా రెండు విమాన సర్వీసులు..

2లో







# టికెట్ క్యాన్సిలేషన్: ప్రయాణికులకు షాక్!

ఢిల్లీ : భారతీయ రైల్వే ప్రయాణికులకు ఇది ముఖ్య గమనిక. రైలు టికెట్ల రద్దు, రిఫండ్ విధానంలో కీలకమైన మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త నిబంధనల ప్రకారం, రైలు బయలుదేరడానికి 8 గంటలలోపు కన్ఫర్మ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే ప్రయాణికులకు ఎలాంటి రిఫండ్ లభించదు. గతంలో ఈ గడువు 4 గంటలుగా ఉండేది. ప్రయాణానికి 8 గంటల నుంచి 24 గంటల మధ్యలో టికెట్‌ను రద్దు చేస్తే టికెట్ ధరలో 50 శాతం మాత్రమే తిరిగి వస్తుంది. అదేవిధంగా, 24 గంటల నుంచి 72 గంటల ముందు రద్దు చేసుకుంటే 25 శాతం కోత విధించి, 75 శాతం మొత్తాన్ని రిఫండ్ చేస్తారు. ఒకవేళ ప్రయాణానికి 72 గంటల కంటే ముందే టికెట్‌ను రద్దు చేస్తే కేవలం సాధారణ రద్దు ఛార్జీలు మాత్రమే వర్తిస్తాయి. టికెట్ ఏజెంట్లు, దళారులు పెద్ద సంఖ్యలో టికెట్లను బ్లాక్ చేసి, చివరి నిమిషంలో రద్దుచేయడాన్ని అరికట్టేందుకే ఈ కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు రైల్వే శాఖ తెలిపింది. దీనివల్ల నిజమైన ప్రయాణికులకు చివరి నిమిషంలో కూడా బెర్తులు అందుబాటులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా దశలవారీగా అమలు కానున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

## చండీగఢ్ బీజేపీ ఆఫీస్ వద్ద భారీ పేలుడు

చండీగఢ్:చండీగఢ్ బీజేపీ కార్యాలయం వద్ద పేలుడు సంభవించింది. పార్క్ చేసి ఉంచిన స్కూటీలో పేలుడు చోటు చేసుకుంది. బీజేపీ పంజాబ్ రాష్ట్ర కార్యాలయం వద్ద పేలుడు సంభవించిన విషయం తెలియగానే పోలీసు బృందాలు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. చండీగఢ్‌లోని సెక్టార్ 37లో సాయంత్రం 5 గంటల తర్వాత పేలుడు చోటు చేసుకుంది. బీజేపీ సీనియర్ నాయకులు, కార్యాలయంలోని నాయకుల ప్రకారం, ఈ పేలుడు కారణంగా భారీ మొత్తంలో నష్టమేమీ జరగలేదు. విషయం తెలియగానే కార్యాలయం వద్దకు చేరుకున్న పోలీసులు, ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పేలుడుకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పంజాబ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు అశ్వని శర్మ పేలుడుకు సంబంధించిన ఫొటోలను తన సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా పంచుకున్నారు.

## ఎల్పీజీ సెగ: హైవేపై ట్రాఫిక్ జామ్

హైదరాబాద్:హైదరాబాద్ నగరంలో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చింది. గ్యాస్ కోసం గంటల తరబడి ఎదురుచూసి విసిగిపోయిన ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి ఆందోళనలు చేపట్టారు. సాగర్ రింగ్ రోడ్డు, ఎల్బీ నగర్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ వంటి పలు ప్రాంతాల్లో రాస్తారోకోలు, ధర్నాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. గత రెండు వారాలుగా ఈ సమస్య కొనసాగుతుండటంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర బారులు తీరి, రాత్రంతా వేచి ఉన్నా గ్యాస్ దొరకడం లేదని వాపోతున్నారు. నిరసనలో భాగంగా కొందరు డ్రైవర్లు రాజేంద్రనగర్‌లో సెల్ టవర్ ఎక్కి ఆందోళన చేయగా, బహదూర్‌పురాలో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. రాష్ట్రంలో రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల కారణంగా విదేశాల నుంచి గ్యాస్ దిగుమతులు ఆలస్యం కావడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించి, సరఫరాను పెంచాలని చమురు సంస్థలను ఆదేశించారు. ఆందోళనల నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేసి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించే ప్రయత్నం చేశారు. నిరసన చేస్తున్న డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అయితే, గ్యాస్ కొరత సమస్య పరిష్కారం కాకపోవడంతో తమ ఆందోళనలు కొనసాగిస్తామని ఆటో డ్రైవర్ల సంఘాలు చెబుతున్నాయి.

## మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా అందించే పౌర సేవలపై వినియోగ ఛార్జీలు 50 శాతం పెంచింది. తక్షణమే పెంచిన ఛార్జీలను (ఏప్రిల్ 1, బుధవారం) అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అందించే పౌర సేవలపై 18 శాతం జీఎస్టీ విధించనుంది. కేటగిరీఏలో రూ.35 నుంచి రూ.62కి, కేటగిరీబీలో రూ.45 నుంచి రూ.80కి పెంచింది. వాస్తవానికి 50 శాతం ఛార్జీలు పెంచినప్పటికీ.. జీఎస్టీ భారంతో కలిపి ఈ ఛార్జీల పెంపు 7778 శాతం వరకు ఉన్నాయి. దీంతో పౌర సేవల కోసం దరఖాస్తు చేసే ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. మరోవైపు మీసేవ నిర్వాహకులకు వచ్చే కమీషన్ దాదాపు 15 ఏళ్ల తరువాత గణనీయంగా పెరిగింది. మీసేవ ద్వారా అందించే పౌర సేవల్లో కేటగిరీఏలో అదనపు డాక్యుమెంట్లు, సంబంధిత విభాగం పరిశీలన అవసరం లేకుండా సేవలు అందుతాయి. కేటగిరీ బీలో సంబంధిత విభాగం విచారణ, పరిశీలన అనంతరం అందించే సేవలు వస్తాయి. గతంలో కేవలం వినియోగ ఛార్జీలు చెల్లించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది. దరఖాస్తుకు అదనంగా నాలుగుకు మించి పత్రాలు స్కాన్ చేయాలన్నా.. ప్రింట్ తీసుకోవాలన్నా పేజీకి రూ.2 చొప్పున చెల్లించాలి. కానీ తాజాగా

**పౌర సేవల వినియోగ ఛార్జీలు**

| కేటగిరీ | ప్రస్తుతం | పెంచినది | నిర్వాహకుల కమీషన్ |
|---|---|---|---|
| | రూ. లలో | రూ. లలో | రూ. లలో |
| ఏ | 35 | 62 | 40.34 |
| బీ | 45 | 80 | 52.10 |
| ఈ-పాస్ | 20 | 35 | 26.40 |
| ఇతర చెల్లింపులు(1) | 25 | 44 | 33.22 |
| ఇతర చెల్లింపులు(2) | 30 | 53 | 40 |


**పలు సేవలకు వినియోగ రుసుములు ఇలా..**

| | |
|---|---|
| ఈ-పాస్ బయోమెట్రిక్ ధ్రువీకరణ | రూ. 35 |
| తెలంగాణ రైతు నమోదు | రూ. 18 |
| కోర్టు కేసు ఈ-కేవైసీ | రూ. 62 |
| త్రైమాసిక పన్ను చెల్లింపు | రూ. 62 |
| డ్రైవింగ్ లైసెన్సు ఫీజు చెల్లింపు | రూ. 62 |
| లెర్నింగ్ లైసెన్సు స్లాట్ బుకింగ్ | రూ. 62 |

వినియోగ ఛార్జీలతో పాటు నాలుగు పేజీల తరువాత ఒక్కో పేజీకి రూ.2.5 చొప్పున ఫీజు ఖరారు చేసింది. ఉదాహరణకు కొత్తగా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసే వ్యక్తి గతంలో రూ.45 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు పెంచిన 50% ఛార్జీతో కలిపి రూ.67.5, దీనికి అదనంగా జీఎస్టీ 18% కలిపి రూ.79.65 (రౌండ్ ఫిగర్ రూ.80) చెల్లించాలి. అంటే ఒక్కో పత్రం కోసం దరఖాస్తు ఫీజు భారం రూ.35గా ఉంది.

**భారీగా కమిషన్ పెంపు..**

మీసేవ నిర్వాహకులకు చెల్లించే కమీషన్ భారీగా పెరిగింది. గతంలో కేటగిరీఏ సేవలు అందించినప్పుడు చెల్లించిన రూ.35 ఫీజుపై రూ.13 కమీషన్‌గా ఉండేది. ఇప్పుడు రూ.62కి పెంచడంతో కమీషన్ రూ.40.34కి చేరింది. అలాగే కేటగిరీబీ సేవలపై ప్రస్తుతం రూ.80 వసూలు చేస్తున్నందున వారికి ఇచ్చే కమీషన్ రూ.52.10కి పెరిగింది. కొన్ని పౌర సేవలకు సంబంధిత ప్రభుత్వ విభాగానికి వాటా ఉంటుంది. కేటగిరీఏ, బీ సేవల్లో ఈ మొత్తం రూ.7గా ఉంది. అయితే కొన్ని సేవలకు ప్రభుత్వ వాటా ఉండదు. అలాంటి సేవల్లో ప్రభుత్వ వాటా రూ.7 నుంచి 30 శాతం ఈసేవ కమిషనరేట్‌కు.. 70 శాతం మీసేవ నిర్వాహకులకు అందుతుంది. ఉపకార వేతనాల (ఈపాస్) దరఖాస్తు సమయంలో విద్యార్థి ఆధార్ ధ్రువీకరణకు ఇప్పటివరకు రూ.20 వసూలు చేసేవారు. ఇక నుంచి ఆ మొత్తాన్ని ప్రభుత్వం రూ.35కి పెంచింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తే 1100 లేదా 18004251110 నంబర్లలో లేదా meesevasupport@telangana.gov.in చిరునామాకు ఈమెయిల్ చేయాలని సిటిజన్ ఛార్టర్‌లో ప్రభుత్వం తెలిపింది.



## విజయవాడ నుంచి హైదరాబాద్‌కు కొత్తగా రెండు విమాన సర్వీసులు..

హైదరాబాద్ : విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించే వారికి శుభవార్త. ఈ రెండు నగరాల మధ్య విమానయాన సేవలు మరింత విస్తృతం కానున్నాయి. కొత్తగా మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నట్లు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ఫ్లై91 ఎయిర్‌లైన్స్ సంస్థ ఈ సర్వీసులను నడపనున్నట్లు ఆయన వెల్లడించారు. మొదటి సర్వీసు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ విమానం ప్రతిరోజూ ఉదయం 6:05 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 7:10 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి విజయవాడ నుంచి ఉదయం 7:30 గంటలకు బయలుదేరి 8:40 గంటలకు హైదరాబాద్‌లో దిగుతుంది. ఇక, రెండో సర్వీసు ఈ నెల 17 నుంచి అందుబాటులోకి వస్తుంది. ఈ విమానం ఉదయం 10:10 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 11:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని డైరెక్టర్ వివరించారు. ఈ కొత్త సర్వీసుల్లో ప్రయాణ ఛార్జీలు రూ.4,000 నుంచి రూ.8,000 మధ్య ఉంటాయని లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉడాన్ పథకం ద్వారా ప్రధాన నగరాల మధ్య విమానయాన అనుసంధానం పెరుగుతోందని, దీనిలో భాగంగానే రాష్ట్రంలోని కడప, కర్నూలు విమానాశ్రయాలను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు

అమరావతి:అమరావతి చట్టబద్ధత బిల్లుకు తెలంగాణ బీజేపీ మద్దతు తెలుపుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అమరావతి చట్టబద్ధతపై లోక్ సభలో చర్చ జరిగింది. లోక్ సభలో కేంద్ర హోంశాఖ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ పోరాటం తర్వాత తెలంగాణ ఏర్పడిందని ఆయన అన్నారు. కేంద్రంలోని కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ సాధించామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969లో కాంగ్రెస్ పార్టీ 369 మంది ఉద్యమకారులను కాల్చి చంపిందని ఆరోపించారు. జై తెలంగాణ అన్నందుకు విద్యార్థులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అని మండిపడ్డారు. చివరి దశ తెలంగాణ ఉద్యమంలో కూడా 1200 మంది విద్యార్థులు ఆత్మార్పణ చేసుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నేడు ఏడు ఎయిర్ పోర్టులు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒకే ఒక్క విమానాశ్రయం ఉందని అన్నారు. దీనికి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల వైఫల్యమే కారణమని ఆరోపించారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు పోటీతత్వంతో అభివృద్ధి కావాల్సి ఉందని అన్నారు. విభజన జరిగి పదేళ్లు దాటినా అమరావతిని రాజధానిగా చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ బీజేపీ తరపున అమరావతి చట్టబద్ధత బిల్లుకు మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

## హనుమాన్ జయంతి: నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు..

హైదరాబాద్ : హనుమాన్ జయంతి సందర్భంగా ఇవాళ హైదరాబాద్ నగరంలో భారీ 'విజయయాత్ర' నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీసులు విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు పలు కీలక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. శాంతిభద్రతల దృష్ట్యా మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 గంటలకు గౌలిగూడ రామాలయం నుంచి ఈ విజయయాత్ర ప్రారంభమై పుత్లిబౌలి, నారాయణగూడ, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, కవాడిగూడ, ప్యారడైజ్ మీదుగా రాత్రి 8 గంటలకు తాడ్‌బండ్‌లోని హనుమాన్ ఆలయానికి చేరుకుంటుంది. ఈ యాత్ర జరిగే మార్గాల్లో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేసి, ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నట్లు జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ తెలిపారు. లక్డీకాపూల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను బషీర్‌బాగ్ వైపు, దిల్‌సుఖ్‌నగర్ నుంచి మెహదీపట్నం వైపు వెళ్లే వాటిని ఎల్‌బీనగర్ మీదుగా పంపనున్నారు. ర్యాలీ సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలను నిషేధించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైన్ షాపులు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఈ ప్రధాన యాత్రలో నగరం నలుమూలల నుంచి సుమారు 14 ఉప యాత్రలు వచ్చి కలవనున్నాయి. ర్యాలీ సాగే మార్గాన్ని పోలీసులు సీసీటీవీల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు.

## ఒకే ఒక రాజధాని... అమరావతికి ఇక తిరుగులేదు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచపటంలో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా

## ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది: సీఎం

- **వింజమూరు సభలో వైసీపీని టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు**
- **కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం**
- **నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తామని హామీ**
- **గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి**
- **చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం**

వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

**హిట్ అండ్ రన్ కంటే దారుణం**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018-19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాల వెల్లువ**

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

# కుషాయిగూడ కంఠమయ్య గుడి అభివృద్ధికి నిధుల కోసం వినతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడలోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మేడ్చల్ కలెక్టర్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్, బి ఆర్ ఎస్ అధ్యక్షుడు నేమురి మహేష్ గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, బుదంపల్లి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డివి అవకాశవాద రాజకీయాలు

**– సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : కేరళ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మోదీ, పినరయి విజయన్ ఇద్దరు ఒకటేనని చేసిన వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తీవ్రంగా ఖండించారు. స్థానిక మంచికంటి భవన్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా లౌకిక శక్తులను కలుపుకొని పోరాటం చేయాల్సిన కాంగ్రెస్ తమ అవకాశవాద రాజకీయాల కోసం లౌకిక విధానాలకు తిలోదకాలిచ్చి వామపక్షాలను విమర్శించడం వారి అవకాశవాద రాజకీయాలకు




నిదర్శనమని అన్నారు. తెలంగాణ ప్రజల సొమ్మును కేరళలో వెదజల్లి ఇక్కడ ప్రజలను మోసం చేయడమే కాకుండా ఇప్పటి వరకు డబ్బు ప్రస్తావనే లేని కేరళ రాజకీయాలను కలుషితం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, ఎం.జ్యోతి, ఎంబి నర్సారెడ్డి, బ్రహ్మాచారి, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ, ఎస్ ఏ నబి, దొడ్డ రవి స్వామి, పద్మ, వీర్ల రమేష్, రాంబాబు, అర్జున్, భూక్యా రమేష్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : దమ్మపేట మండలంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక పర్యటన చేసి తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలలను బుధవారం తనిఖీలు చేశారు. దరఖాస్తులను గడువులో పరిష్కరించాలని, మీ సేవ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలు స్థానికంగానే పరిష్కరించాలని సూచించారు. గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మెనూ పాటించకపోవడం, భోజన నాణ్యత లోపాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. మిల్లెట్ కూర సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి, నాణ్యమైన ఆహారం అందించాలని హెచ్చరించారు. చేతులు కడుక్కునే ప్రదేశంలో ట్యాప్‌లు లేక నీరు వృథా అవుతుండటాన్ని గమనించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. మండలంలోని కుటుంబ పాఠశాలలో నాణ్యమైన భోజనం అందుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, భద్రతా చర్యలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ ల అమలును నిలిపివేయాలి

*** ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్**




కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కార్మిక సంఘాల డిమాండ్ చేశారు. సిఐటియు, ఏఐటీయూసీ కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్. సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ లు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేవదానం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి సిఐటియు, ఏఐటియుసి నాయకులు కే శీను మల్లారెడ్డి. శ్రీనివాస్, ఆంజనేయులు, మహేందర్, నర్సింహారెడ్డి వీరేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉత్తమ గ్రామ పంచాయితీ లు గారు ఎంపికైన వికారాబాద్ జిల్లా గ్రామాలు





వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పంచాయతీ లకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీకి గుడ్ గవర్నెన్స్" విభాగంలో జాతీయ అవార్డు దక్కింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలం గాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అవకతవకలు

**- ఎన్నికల అధికారులు అమ్ముడుపోయారని ఫిర్యాదు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : ఈ నెల 26న జరిగిన చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భారీగా అవకతవకలు జరిగాయని, ఎన్నికల అధికారులు కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావు లు అమ్ముడుపోయారని ఆరోపిస్తూ న్యాయవాదులు వాకిటి నరసింహారెడ్డి, పాల పరమేష్, ఏ రంగారెడ్డిలు బుధవారం తెలంగాణ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావులు రెండు బ్యాలెట్ బుక్కులను ప్రింట్ చేయించి, సంతకాలు సైతం పెట్టి, ఒక బ్యాలెట్ బుక్కును ఒక వర్గం వారికి ఇచ్చి సహకరించారని ఆరోపించారు. ఒక న్యాయవాది వద్ద డమ్మీ బ్యాలెట్ పేపర్ దొరకడం, అందులో స్వస్తిక్ గుర్తు ఉండడంతో తమకు అనుమానం



TO
The Secretary,
Bar Council of Telangana,
Hyderabad.

Date: 01-04-2026.

Subject: Complaint against Sri Ch. Radha Kishan Rao and Sri Kanugula Venkataiah, Election Officers — Misconduct, Electoral Irregularities, Dereliction of Duty, and Collusion in Bar Association, Choutuppal Elections dated 26-03-2026 — Request for Inquiry and Re-Election.

Respected Sir/Madam,

I, Vakiti Narsimha Reddy, Advocate, Enrollment No. TS/2592/2010, practicing advocate at the Court of the Hon'ble Junior Civil Judge at Choutuppal, hereby submit this complaint against Sri Ch. Radha Kishan Rao and Sri Kanugula Venkataiah were appointed as Election Officers for the Bar Association, Choutuppal elections held on 26-03-2026.

I. PRE-ELECTION DIRECTIONS VIOLATED:

Prior to polling, the Election Officers issued the following directions:

1. Mobile phones are strictly prohibited inside the polling hall.
2. Only the voter and one booth agent per candidate are permitted inside.

Despite issuing these directions, the Election Officers failed to enforce them and acted in violation of their own orders, indicating deliberate complicity.

II. ANTECEDENTS AND PRIOR OBJECTIONS (06-03-2026):

At the General Body Meeting dated 06-03-2026, the following objections were raised:

(a) Prior Misconduct in 2024-25 Elections:

Both Election Officers had previously conducted the 2024-25 elections and committed irregularities in favour of the same candidates/supporters of the same candidates. A specific objection was raised against their re-appointment, which was ignored, enabling the continuation of the same pattern.

(b) Ineligibility of Sri Kanugula Venkataiah:

01/04/26 Received copy

వచ్చిందని స్పష్టం చేశారు. తాము వెంటనే ఎన్నికల అధికారులను సంప్రదించి, ఒక అధికారి సంతకం మాత్రమే ఉంది, రెండో అధికారి సంతకం పెట్టాలని, బయట నుంచి వచ్చే బ్యాలెట్ పేపర్లను ఆపవచ్చని చెప్పినా, వారు తమ మాటను లెక్క చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఓటరు తన నడుము వద్ద సెల్ ఫోన్ పెట్టుకోవడం, అది వీడియో కాల్ ఆన్ లో ఉండడం గమనించి, ఆ ఫోన్లో ఎన్నికల అధికారికి ఇవ్వగా, సీజ్ చేయకుండానే తిరిగి అతనికి ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు సమయంలో స్వస్తిక్ గుర్తులు వేరువేరుగా ఉండటం, ఇంకు డిఫరెంట్ గా ఉండటం, బ్యాలెట్ పేపర్లు ఎక్కువగా ముడతలు పడటం గమనించి తాము అభ్యంతరం వ్యక్తం చేసి, రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. బ్యాలెట్ పేపర్లు, స్వస్తిక్ గుర్తులు, ఇంకు ప్యాడ్ లను సీజ్ చేయాలని కోరమన్నారు. ఎన్నికల అధికారులు తమ ఫిర్యాదును తీసుకోలేదని, మెటీరియల్ ను సైతం సీజ్ చేయకుండా వదిలేశారన్నారు. దీంతో ఎన్నికల అధికారులు అమ్ముడుపోయినట్టు ధృవపడినట్లు స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులు తమ బండారం బయటపడుతుందనే మెటీరియల్ ను సీజ్ చేయలేదని పేర్కొన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేస్తూ చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికను రద్దుచేసి, మరల ఎన్నిక జరపాలని, ఎన్నికల అధికారులైన కానుగుల వెంకటయ్య, సిహెచ్ రాధా కిషన్ రావులపై విచారణ జరిపి, వారిని బార్ కౌన్సిల్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

# ప్రజా పోరాటాల స్ఫూర్తిని ఇంటింటికి తీసుకెళ్తాం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రజా పోరాటాల స్ఫూర్తిని ఇంటింటికి తీసుకెళ్తామని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు నడుం బిగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి సిపిఐ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు పక్షం రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పేదల పక్షాన నిలబడే పోరాటాల పార్టీకి ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ఈ పదిహేను రోజుల ప్రచారంలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జి.వీరాస్వామి, భూక్యా దస్రు, ఎస్ కె ఫహీమ్, కుమారి హన్మంతరావు, దీటి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత

**- చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: మున్సిపల్ పరిధిలోని ప్రజల ఆరోగ్యానికి తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 9,10,11,19వ వార్డుల ప్రజలకు నిర్వహించిన మెడికల్ హెల్త్ క్యాంపును చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ క్యాంపులో పోర్టబుల్ ఎక్స్ రే మిషన్ ద్వారా ఉచితంగా ఎక్స్ రే తీశారు. బిపి, షుగర్, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాల గురించి ఉచిత మెడికల్ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలందరికీ అవసరమైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఆరోగ్య, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, 10వ వార్డు కౌన్సిలర్ దేప రమ్య రాజు, డిప్యూటీ డి ఎం హెచ్ వో లు డాక్టర్ యశోద, డాక్టర్ సుమన్ కళ్యాణ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ చింతకింది కాటమరాజు, డా సికిలంమెట్ల జయంత్ కుమార్, సిబ్బంది ప్రణతి, లక్ష్మి, పద్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణి



ఖమ్మం జిల్లా / ప్రజాస్ఫూర్తి . : రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 1 నుంచే జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో ఈ పంపిణీ పక్రియ ప్రారంభమైంది. జిల్లాలో 748 దుకాణాల పరిధిలో 4,69,865 కార్డుదారులు ఉండగా , 13,28,400 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి నెలకు కేజిల చొప్పున , మూడు నెలలకు గాను 2,54,71,860 కేజిల బియ్యం అవసరమని అధికారులు తెలిపారు. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

# ఇండ్ల స్థలాలకోసం ఆందోళన కు టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధం



ప్రజాస్ఫూర్తి /ఖమ్మం : జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధనే లక్ష్యంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధమవుతోందని వెల్లడించారు. ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ లో బుధవారం ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తొలుత సంతకాల సేకరణతో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని అన్నారు. ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు, మంత్రుల క్యాంపు కార్యాలయాలు, కలెక్టరేట్ ముట్టడి, అంతిమంగా ఆమరణ నిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. అలాగే అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, స్కూల్, కళాశాలల ఫీజుల్లో రాయితీ... తదితరాంశాలపై కూడా సమావేశం చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కోశాధికారి తేనె వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవి కిరణ్, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు బాలకృష్ణ, నలుబోల మధుశ్రీ, కూరాకుల గోపి, జక్కంపూడి కృష్ణ, , తురగ మూర్తి, దగ్గుబాటి మాధవరావు, నూకల రామచంద్రమూర్తి,జిల్లా కమిటీ సభ్యులు షేక్ జానీ పాషా, కొత్త యాకేష్,మోహన్


# గ్రామ సభలు విజయవంతం చేయాలి : కలెక్టర్ అంకిత్

**ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం**





ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఉదయం 9 గంటలకు సభలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. రైతులకు లాభదాయక పంటలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజలు సభలకు హాజరై సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ లో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఎన్నికల అధికారులు చెన్నూరి రాధా కిషన్ రావు, కానుగుల వెంకటయ్యల అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా తాడూరు పరమేష్, ప్రధాన కార్యదర్శిగా పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పిట్టల బిక్షమయ్య, సహాయ కార్యదర్శిగా మక్తాల నరసింహ, లైబ్రరీ సెక్రటరీగా నర్రి స్వామి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దేశ గోని శ్రీశైలం, మహిళ ప్రతినిధి నకరికంటి జ్యోతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎండి. ఖయ్యూం పాషా, పిల్లలమర్రి కిరణ్ లు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కార్యవర్గాన్ని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాడూరు పరమేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో చౌటుప్పల్ పట్టణంలో మరో అడిషనల్ కోర్టు, సబ్ కోర్టు అదేవిధంగా కోర్టులకు కావలసిన శాశ్వత భవన నిర్మాణం కొరకు నూతన పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బాల్యం వెంకట చలపతి, ఊడుగు శ్రీనివాస్, ఎలమోని శ్రీనివాస్, ఎన్నికల అధికారులు సిహెచ్ రాధాకృష్ణ రావు, కానుగు వెంకటయ్య, న్యాయవాదులు రాపోలు వేణు, ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, జెల్ల రమేష్, బడుగు శ్రీకాంత్, జక్కర్తి శేఖర్, దాచేపల్లి చంద్రబాబు, బొంగు గోపాల్, రిక్కల సుధాకర్ రెడ్డి, కట్టెల లింగస్వామి, అవ్వారు చేతన్, పాల పరమేష్, సీహెచ్ జంగయ్య, జె శ్రీశైలం,భరత్ కుమార్, ఐతగోని శ్రీకాంత్, మల్లికార్జున్, విజయ్ కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొండాపూర్ లో అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక వైభవం



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : కొండాపూర్‌లోని ఆర్‌టీఏ కార్యాలయం ఎదురుగా గల అయ్యప్ప స్వామి దేవాలయంలో భక్తి పరవశం నడుమ మహా పడి పూజ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. దేవాలయ నిర్వాహకులు బుయ్యా బాలరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరసింగ్ గురు స్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని కీర్తించారు. అదే విధంగా సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. భక్తుల సహకారంతో మహా పడి పూజ, రక్తదాన శిబిరం, అన్నప్రసాద కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం.. ఇది చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్

- **లోక్‌సభలో అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుకు ఆమోదం**
- **ఇది ప్రజా విజయం అంటూ పవన్ కల్యాణ్ ప్రకటన**
- **33 వేల ఎకరాలిచ్చిన రైతులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు వెల్లడి**
- **ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబులకు హృదయపూర్వక కృతజ్ఞతలు**
- **పెట్టుబడిదారుల్లో కొత్త విశ్వాసం ఏర్పడిందన్న డిప్యూటీ సీఎం**

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని



కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని పవన్ విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు. పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని పవన్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

## తెలంగాణ మీసేవ కేంద్రాల సర్వీసు ధరల పెంపు

హైదరాబాద్: తెలంగాణలో మీసేవ కేంద్రాల్లో సర్వీసు ధరలను పెంచారు. అన్ని సర్వీసులపై సుమారు 50 శాతం ధరలు పెంచారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆదాయ, కుల, స్థానికత వంటి సర్టిఫికెట్ల జారీకి రుసుం రూ.80 చేశారు. జనన ధ్రువీకరణ పత్రం రుసుం రూ.62 చేశారు.




## అమరావతికి చట్టబద్ధతతో.. బలమైన భవిష్యత్తు: రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం: రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడం ఆనందంగా ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరి శ్రమకు ఫలితం లభించిందని.. వారందరికీ ఈ విజయం అంకితం ఇస్తున్నట్లు తెలిపారు. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు తెరదించుతూ.. అవమానాలకు ముగింపు పలుకుతూ.. బలమైన భవిష్యత్తుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తోందన్నారు. ''ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా వైకాపా ఎంపీలు వాకౌట్ చేయడం.. వారి విధ్వంస వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. సీఎం చంద్రబాబు ప్రపంచస్థాయి నగరాన్ని నిర్మిస్తూ ఉంటే.. అమరావతిని



ఓ స్కామ్‌గా జగన్ పేర్కొనడం ఆయన అజ్ఞానాన్ని, రైతులపై ఉన్న అసూయను చాటుతోంది. ఎవరెన్ని ఆరోపణలు చేసినా.. నిజాలు తెలిసిన ప్రజలు.. కూటమితో కలిసి అభివృద్ధి వైపు నడవడానికే మొగ్గు చూపుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు'' అని తెలిపారు.

## ఏపీకి బస్సుల రిజిస్ట్రేషన్ బదిలీకి ప్రభుత్వం ఆసక్తిగా ఉంది: మంత్రి మండిపల్లి

రామాపురం: ఇతర రాష్ట్రాల్లో నమోదై ఉన్న తమ బస్సులను ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేసుకునేలా సంబంధిత యజమానులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉందని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో.. రవాణాశాఖ ప్రధాన కార్యదర్శి, కమిషనర్, ఇతర సీనియర్ అధికారులు, అఖిల భారత పర్యాటక బస్సుల యజమానుల సంఘం




సభ్యులతో బుధవారం వీడియో సమావేశంలో మాట్లాడారు. త్రైమాసిక పన్నును ఒక్కో సీటుకు రూ.4 వేల నుంచి రూ.2,500కు తగ్గిస్తామన్నారు. ఫలితంగా బస్సుల నిర్వాహకులు, ప్రయాణికులు లబ్ధి పొందుతారని చెప్పారు. భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడంతోపాటు బస్సుల ఫిట్‌నెస్‌ను నిర్ధరించడానికి క్రమం తప్పకుండా తనిఖీలు చేయిస్తామన్నారు. తద్వారా ప్రమాదాలు నియంత్రించవచ్చన్నారు. సీనియర్ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీ ద్వారా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నిబంధనలకు అనుగుణంగా బస్సుల నిర్వాహకులను ప్రోత్సహిస్తామని సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు.

## ప్రజలను తప్పుదారి పట్టించడమే జగన్ ఉద్దేశం: మంత్రి నారాయణ

నెల్లూరు: అమరావతే ఏపీ రాజధాని అని చట్టసభలో నిర్ణయించినట్లు మంత్రి నారాయణ అన్నారు. ఈ వ్యవహారంపై వైకాపా నేతలకు ఏం మాట్లాడాలో తెలియక.. ప్లాట్లు, ఖర్చు అంటున్నారని విమర్శించారు. జగన్ నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2028 ఆగస్టు నాటికి అమరావతి పూర్తవుతుందని.. నెల్లూరులో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. ''బిల్లును ఆమోదించాల్సింది పోయి.. డబ్బులు ఎంత అవుతాయని వైకాపా నేతలు అడుగుతున్నారు. రైతులకు ప్లాట్లు ఎప్పుడిస్తారో



చెప్పాలంటున్నారు. కానీ, వారు వాస్తవాలు తెలుసుకోవాలి. ఇప్పటికే 34,980 ఎకరాల్లో ప్లాట్లు అలాట్ చేశాం. ఇంకా 651 మందికి మాత్రమే ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. కొన్ని సమస్యల వల్ల ఆలస్యమైంది. రైతులకు ఇచ్చిన ప్లాట్లను వారి పేరుమీద రిజిస్ట్రేషన్ కూడా చేశాం. రూ.10 లక్షల కోట్ల అప్పు చేశారని, అవి తీర్చేసరికి ప్రభుత్వం పని అయిపోతుందని వైకాపా నేతలు అంటున్నారు. గతంలో సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు వేసుకునేందుకు రూ.700 కోట్లు ఖర్చు చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించడమే జగన్ ఉద్దేశం. మావిగన్ అనేది ఎందుకు అంటున్నారో అర్థం కావడం లేదు'' అని మంత్రి నారాయణ అన్నారు.

## అమరావతి భవిష్యత్తుపై అనిశ్చితికి నేటితో తెరపడింది

- **ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి... బిల్లుకు లోక్ సభలో ఆమోదం**
- **బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి హర్షం**
- **ఇది చారిత్రక విజయమని, రైతులకు దక్కిన గౌరవమని వ్యాఖ్య**
- **ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు కృతజ్ఞతలు తెలిపిన సుజనా**

ఆంధ్రప్రదేశ్ : ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు 2026'ను నేడు లోక్ సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో అమరావతి భవిష్యత్తుపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడినట్లయింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంపై బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రక విజయమని, రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు దక్కిన గొప్ప గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అమరావతికి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం ద్వారా భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి కేంద్రం ముగింపు పలికింది. ఇది అపూర్వ విజయం" అని పేర్కొన్నారు. కోట్లాది ఆంధ్రుల స్వప్నానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు సుజనా చౌదరి తన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు ఇతర రాజకీయ పార్టీల సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక



ధన్యవాదాలు తెలియజేశారు. రాజధాని కోసం ప్రాణ త్యాగాలు చేసిన రైతులు, పోరాడిన ప్రజల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

## తెలుగు ఎంపీల తీరుపై షర్మిల ఫైర్

- **ఏపీ ఎంపీలు బీజేపీకి బానిసలుగా మారి రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించారన్న షర్మిల**
- **విభజన హామీలు, ప్రత్యేక హోదాపై మోదీని నిలదీసే ధైర్యం వారికి లేదని విమర్శలు**
- **స్వలాభం కోసం పనిచేస్తున్న ఎంపీలంతా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్**
- **విభజన హామీల విలువ రూ.5 లక్షల కోట్లు... దాన్ని ఎన్ క్యాష్ చేసుకోలేకపోతున్నారంటూ ఫైర్**



ఆంధ్రప్రదేశ్ : ఆంధ్రప్రదేశ్ ఎంపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి జీవన్మరణ సమస్య అయిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారని, వారు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా, బీజేపీకి బానిసలుగా మారారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలి, స్వలాభం కోసం పనిచేస్తున్న ఎంపీలంతా తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇవాళ లోక్ సభలో అమరావతి చట్టబద్ధత బిల్లును కేంద్రం ప్రవేశపెట్టడం తెలిసిందే. దీనిపై జరిగిన చర్చలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ ప్రసంగించారు. ఈ నేపథ్యంలోనే, తెలుగు ఎంపీలపై షర్మిల విరుచుకుపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. పార్లమెంట్ వేదికగా ఏపీ విభజన హామీల గురించి గళం విప్పిన మాణికం ఠాగూర్‌కు రాష్ట్ర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. అయితే, ఆయన మాట్లాడుతున్నప్పుడు రాష్ట్రం నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా మద్దతుగా నిలబడకపోవడం తెలుగుగడ్డ చేసుకున్న దౌర్భాగ్యమని మండిపడ్డారు. "మన ఎంపీలకు స్వలాభం మిన్న, రాష్ట్ర ప్రయోజనాలు సున్నా. పేరుకు మాత్రమే వేర్వేరు పార్టీల ఎంపీలు, కానీ అందరూ మోదీకి భజనపరులే. బీజేపీ బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప, 11 ఏళ్లు గడుస్తున్నా హోదా ఏమైందని అడిగే దమ్ము ఒక్కరికీ లేదు" అని షర్మిల ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తామని లిఖితపూర్వకంగా చెబుతున్నా, రాజధాని అమరావతి నిర్మాణానికి సాయం చేయలేమని స్పష్టం చేస్తున్నా ఎంపీలు నోరు మెదపడం లేదని ఆమె విమర్శించారు. ఇప్పటివరకు విభజన హామీలలో 5 శాతం కూడా అమలు కాలేదని, అయినా మన ఎంపీలు మౌనం వహిస్తూ 'గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారని' ఘాటుగా వ్యాఖ్యానించారు. "2014లోనే విభజన హామీల విలువ 5 లక్షల కోట్లు. అది మన చేతిలో ఉన్న చెక్కు లాంటిది. కానీ మన ఎంపీల అసమర్థత వల్లే దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేకపోతున్నాం. తెలుగువారి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రధాని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించే ధైర్యం లేని 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు వెంటనే రాజీనామా చేయాలి" అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.




## లోక్ సభలో అమరావతి బిల్లు పాస్.. టీవీ లైవ్ చూసి చప్పట్లు కొట్టిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్ : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే చారిత్రక ఘట్టం పార్లమెంటులో ఆవిష్కృతమవుతున్న వేళ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆ క్షణాలను టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. లోక్‌సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆయన చప్పట్లు కొట్టి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సభలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ ఎంపీ పురందేశ్వరి అమరావతికి మద్దతుగా మాట్లాడుతున్న దృశ్యాలను తన ఫోన్‌లో వీడియో తీశారు. 'ఒకే రాష్ట్రం ఒకే రాజధాని' నినాదంతో, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ గతంలో చేసిన ఏకగ్రీవ తీర్మానానికి అనుగుణంగా, అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును నేడు లోక్ సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. ఈ చారిత్రక సందర్భంపై లోకేశ్ స్పందిస్తూ, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే రోజని అభివర్ణించారు. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నా రాజధాని అమరావతి" అని ప్రతి ఒక్కరూ చెప్పుకునే రోజు ఇదని అన్నారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షల విజయమని, రైతుల త్యాగాలకు దక్కిన దైవ ఆశీస్సులని, శాంతియుత పోరాటానికి లభించిన ఫలితమని పేర్కొన్నారు. అమరావతి బిల్లుకు మద్దతుగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి, ఇతర పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతి నిలిచిందని పేర్కొంటూ, "జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి" అని నినదించారు. "అమరావతి చట్టబద్ధత బిల్లుపై లోక్ సభలో జరిగిన చర్చ మొత్తం టీవీలో చూశాను. ఉత్కంఠ రేపింది. అమరావతి చరిత్రసంస్కృతి, ఆవశ్యకత సభ్యులు వివరిస్తుంటే ఒక ఆంధ్రుడిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం, దేశంలోని వివిధ పార్టీలు నిలవడం ఐదుకోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టింది. లోక్‌సభ వేదికగా అమరావతి గొప్పతనం దేశమంతటికీ మరోసారి పరిచయమైంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటులో చరిత్ర సృష్టించిన అమరావతి చట్టబద్ధత బిల్లు చర్చలో పాల్గొనకుండా వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడం వారి ద్రోహబుద్ధికి నిదర్శనం. జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిలో ఒక్క ఇటుకనూ తాకలేడు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధినీ ఆపలేడు. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ శాశ్వతం, నా రాజధాని అమరావతి అజరామరం" అంటూ లోకేశ్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు.

# ఇరాన్ యుద్ధంలోకి సౌదీ, యూఏఈ..?

ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోన్న నేపథ్యంలో వాల్‌స్ట్రీట్ జర్నల్ సంచలన కథనాన్ని ప్రచురించింది. టెహ్రాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(UAE) పాల్గొనేందుకు సిద్ధమైనట్లు ఆ కథనం పేర్కొంది. ఇరాన్ తమ దేశంపై ఎన్ని దాడులు చేసినప్పటికీ ఓపికతో ఉన్న యూఏఈ ప్రస్తుతం అమెరికాతో చేతులు కలపనున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయడం వల్ల తమ దేశం ఇప్పటికే చాలా నష్టపోయిందని.. ఇకపై ఆవిధంగా జరగకూడదనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకుందని తెలిపింది. అదే జరిగితే ఇరాన్ యుద్ధంలో నేరుగా పాల్గొన్న మొదటి పర్షియన్ గల్ఫ్ దేశంగా యూఏఈ నిలవనుంది.



గతంలో తమ వైమానిక స్థావరాలను అమెరికా(US) సైన్యం ఉపయోగించుకొనేందుకు అనుమతించని సౌదీ అరేబియా.. ప్రస్తుతం అందుకు అంగీకరించినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. హర్మూజ్ జలసంధిని తెరిపించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు తమ దేశం మద్దతిస్తోందని అధికారిక వర్గాలు పేర్కొన్నట్లు వెల్లడించింది.

*** ప్రపంచ దేశాల మద్దతు కోసం ప్రయత్నం..**

ఇరాన్‌పై దాడుల కోసం యూఏఈ రహస్యంగా ప్రపంచ దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇందులోభాగంగానే అక్కడి నేతలు ఇరాన్‌పై చర్యలకు అధికారం ఇచ్చే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైతే బలప్రయోగం చేసైనా.. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఒక కూటమిని ఏర్పాటుచేయాలని యూఏఈ దౌత్యవేత్తలు అమెరికా సహా యూరప్, ఆసియాలోని కీలక దేశాలను కోరుతున్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్ హర్మూజ్‌ను పూర్తిగా తన అధీనంలోకి తీసుకొని.. ప్రపంచ ఆర్థికవ్యవస్థను పతనం చేస్తుందని అందరికీ వివరిస్తున్నారు.

**ఇరాన్‌కు వ్యతిరేకంగా గల్ఫ్ దేశాలు**

తమ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగిస్తుండడంతో గల్ఫ్ దేశాల ప్రజలు ఇరాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. టెహ్రాన్ ప్రభుత్వం బలహీనపడే వరకు లేదా అధికారం నుంచి తొలగిపోయే వరకు యుద్ధం కొనసాగించాలని కోరుకుంటున్నారు. ఆయా దేశాలు తమ సైన్యాన్ని స్వయంగా రంగంలోకి దించనప్పటికీ.. అమెరికాకు రహస్యంగా మద్దతునిస్తున్నాయి. ఇరాన్‌పై పట్టు సాధించాలంటే దశాబ్దాలుగా ఇరాన్ నియంత్రణలో ఉండి.. యూఏఈ హక్కులు కోరుతున్న అబు మూసా వంటి వ్యూహాత్మక ద్వీపాలను ఆక్రమించుకోవాలని యూఏఈ అమెరికాకు సూచించింది.

## తమిళనాడులో అల్లర్లు సృష్టించేందుకు భాజపా కుట్ర: స్టాలిన్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా భాజపా లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. యూపీ, మణిపుర్‌లో మాదిరిగా.. తమిళనాడులోనూ అల్లర్లు సృష్టించేందుకు కాషాయం పార్టీ కుట్ర పన్నిందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరుచ్చిలో జరిగిన బహిరంగ



సభలో స్టాలిన్ మాట్లాడారు. భాజపా పాలిత రాష్ట్రాల్లో కన్పించే ఘర్షణలు, మూక దాడులు తమిళనాడులో లేవన్నారు. ఈ సందర్భంగా యూపీ, మణిపుర్ పేర్లను ఆయన ప్రస్తావించారు. అయితే, తమిళనాడులో కూడా అలాంటి హింసాత్మక పరిస్థితులను సృష్టించేందుకు భాజపా కుట్ర పన్నిందని ఆరోపించారు. కానీ తమ పార్టీ ఆ కుట్రను భగ్నం చేసిందన్నారు. ఇక, రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే.. మహిళలు తమకు నచ్చిన గృహోపకరణాలు కొనుగోలు చేసుకునేందుకు వీలుగా రూ.8వేల కూపన్‌ను అందిస్తామన్నారు. దీంతో పాటు ప్రతినెలా మహిళలకు రూ.2వేల ఆర్థికసాయం, కళాశాల విద్యార్థులకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చారు.

## 2019 తర్వాత.. తొలిసారి భారత్‌కు ఇరాన్ ముడిచమురు

యుద్ధం కారణంగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ఇటీవల అమెరికా పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ చమురు కొనుగోలుకు భారత రిఫైనరీలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఇరాన్ నుంచి ఓ ఆయిల్ ట్యాంకర్ భారత్ వైపు బయల్దేరింది. మార్చి 4వ తేదీన ఖర్గ్ ద్వీపం వద్ద ట్యాంక్‌లోకి చమురు లోడింగ్ చేశారని.. ఏప్రిల్ 4న గుజరాత్ వాడినార్ పోర్టుకు ఇది చేరుకోనుందని డేటా ఇంటెలిజెన్స్ సంస్థ క్లెప్లర్ వెల్లడించింది. 2019 తర్వాత ఇరాన్ చమురు భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇందులో దాదాపు 6,00,000 బ్యారెళ్ల చమురు ఉండొచ్చని అంచనా. ఇరాన్ నుంచి వస్తున్న ఈ చమురును ఏ భారతీయ



రిఫైనరీ ఉపయోగించనుందనే విషయంపై ఎటువంటి సమాచారం లేదు. గతంలో భారత్.. ఇరాన్ చమురుకు ప్రధాన కొనుగోలుదారుగా ఉండేది. ఒకానొక సమయంలో..మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా సుమారు 11.5 శాతంగా ఉండేది. 2018లో భారత్ రోజుకు సుమారు 5,18,000 బ్యారెళ్ల ఇరాన్ చమురును దిగుమతి చేసుకోగా.. మే 2019 నాటికి అది రోజుకు 2,68,000 బ్యారెళ్లకు తగ్గింది. ఆ తర్వాత, ఇరాన్‌పై అమెరికా ఆంక్షల కారణంగా ఆ దేశం నుంచి చమురు దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయి.

## ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేదు: కేంద్రం

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం స్పందిస్తూ.. 'ఇంధన ధరలు పెంచే ప్రసక్తే లేద'ని స్పష్టం చేసింది. దేశంలో చమురు నిల్వలు సరిపడా ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ వెల్లడించారు. ''దేశంలో చమురు, గ్యాస్ నిల్వలు రెండు నెలలకు సరిపడా ఉన్నాయి. రాబోయే రోజుల్లో కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో అధికంగా కొనాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎల్పీజీ(LPG) నిల్వలు కూడా సరిపడా ఉన్నాయి. ఒక వేళ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై కేంద్రం యోచిస్తోంది. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రెండు నెలల క్రితం బ్యారెల్‌కు 70 డాలర్ల దగ్గర ట్రేడ్ అయిన బ్రెంట్ క్రూడ్, ఈ రోజు 100



డాలర్ల మార్కును దాటింది. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు డీజిల్, పెట్రోలు ధరలను పెంచలేదు. వినియోగదారులపై భారం తగ్గించేందుకు ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం'' అని పేర్కొన్నారు.

## ఉత్తర కొరియా హ్యాకర్ల పంజా.. వేలాది అమెరికా కంపెనీలు ఎఫెక్ట్


ఉత్తర కొరియాకు చెందిన సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. వేలాది అమెరికా కంపెనీలు ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ప్యాకేజీని అక్రమంగా యాక్సెస్ చేశారు. ఈ సైబర్ దాడి నుంచి అమెరికా కంపెనీలు కోలుకోవడానికి కొన్ని నెలల సమయం పట్టనుందని సెక్యూరిటీ నిపుణులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు సంబంధించిన ప్రతి రంగంలోని కంపెనీలు ఉపయోగించే యాక్సియోస్ అనే ఓపెన్ సోర్సు సాఫ్ట్‌వేర్‌ను నిర్వహించే ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఖాతాను హ్యాకర్లు యాక్సెస్ చేశారు. దాంతో ఆ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన తప్పుడు అప్‌డేట్లను కంపెనీలకు పంపించారు. హ్యాకింగ్‌ను గుర్తించిన సాఫ్ట్‌వేర్ డెవలపర్ తన అకౌంట్‌ను తిరిగి తన నియంత్రణలోకి తెచ్చుకొనేవరకు ఈ దాడి జరిగినట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. ఈ ప్రభావాన్ని అంచనా వేసి, దానినుంచి కోలుకునేందుకు ఆయా కంపెనీలకు కొన్ని నెలల సమయం పట్టొచ్చని తెలుస్తోంది. ఇది ఉత్తరకొరియా హ్యాకర్ల పనేనని సైబర్ ఇంటెలిజెన్స్ సంస్థలు వెల్లడిస్తున్నాయి. ఉత్తర



కొరియాకు చెందిన హ్యాకర్లు ఇలాంటి దాడులకు పాల్పడటం ఇదేం కొత్తకాదు. గతంలో పలు బ్యాంకులు, క్రిప్టో కరెన్సీ సంస్థలపై సైబర్ దాడికి పాల్పడి బిలియన్ల డాలర్లు దొంగిలించారని వార్తలు వచ్చాయి. ఆ సొమ్మును కిమ్ యంత్రాంగం తమ క్షిపణుల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు సమాచారం.

## నాటో నుంచి వైదొలుగుతాం: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. నాటో కూటమి నుంచి వైదొలిగే యోచనలో ఉన్నామని అన్నారు. బ్రిటన్‌కు చెందిన 'ది టెలిగ్రాఫ్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఆ కూటమి ఓ కాగితపు పులి వంటిదన్నారు. ఈ విషయం రష్యాకూ తెలుసునని చెప్పారు. ఆ కూటమి మాటలకు తానెప్పుడూ ప్రభావితం కాలేదన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలని చేసిన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై నాటో దేశాలపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్న



ట్రంప్.. వాళ్లు పిరికివాళ్లంటూ ఇటీవల విమర్శించిన విషయం తెలిసిందే.

## మస్క్ స్టార్‌లింక్‌ను మాత్రం వదిలిపెట్టం: ఇరాన్

అమెరికా మిత్ర దేశాల్లోని కీలక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడుతోంది. ఈ క్రమంలో మస్క్ స్టార్‌లింక్ (Starlink) శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థను తమ లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. బహ్రెయిన్, కువైట్, యూఏఈలో ఆ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగేకొద్దీ గల్ఫ్ దేశాల్లోని స్టార్‌లింక్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తామంది. ఇప్పటికే ఇజ్రాయెల్‌తో సంబంధం ఉన్న దాదాపు 18 అమెరికా టెక్ కంపెనీల మౌలిక సదుపాయాలను టార్గెట్ చేసినట్లు తెలిపింది.




ఇరాన్ (Iran) దాడుల్లో తరచూ ఇంటర్నెట్ బ్లాక్‌అవుట్ సమస్య తలెత్తుతుండడంతో పలు గల్ఫ్ దేశాలు స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ వ్యవస్థను ఉపయోగిస్తున్నాయి. దీంతో ఐఆర్‌జీసీ ఈ హెచ్చరికలు చేసింది. యాపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, ఐబీఎం, డెల్, టెస్లా, బోయింగ్, హెచ్‌పీ, జేపీ మోర్గాన్ తదితర అమెరికా కంపెనీలకు చెందిన యూనిట్‌లపైనా ఏప్రిల్ 1 నుంచి దాడులు చేసే అవకాశం ఉందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఆయా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు ప్రాణాలు కాపాడుకోవాలంటే తక్షణమే వెళ్లిపోవాలని.. స్థానిక నివాసితులు కూడా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇప్పటికే ఇరాన్‌లో స్టార్‌లింక్ సేవలను ఉపయోగించడంపై నిషేధం ఉంది. ఆ నెట్‌వర్క్‌ను ఉపయోగించిన వారికి టెహ్రాన్ ప్రభుత్వం రెండేళ్ల జైలు శిక్ష విధిస్తోంది.


## ఇది మా యుద్ధం కాదు: యూకే ప్రధాని



పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్ జలసంధిలో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హర్మూజ్‌ను తిరిగి తెరిచే మార్గాలపై చర్చించేందుకు ప్రపంచ స్థాయి సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న ప్రతి దౌత్య మార్గాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అయితే ఇరాన్ యుద్ధంలోకి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ దిగబోమని తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధి విషయంలో తన మాట వినని యూకేకు అమెరికా సాయం చేయబోదని ట్రంప్ హెచ్చరికలపై స్టార్మర్ స్పందిస్తూ.. ఎవరు ఎంత ఒత్తిడి తీసుకువచ్చినా బ్రిటన్ ప్రయోజనాల కోసమే ఆలోచిస్తానన్నారు. ఇది తమ యుద్ధం కాదని.. అందువల్లే ఇందులోకి వెళ్లదలుచుకోలేదని స్పష్టంచేశారు. ప్రస్తుత సంఘర్షణలతో యూకే భవిష్యత్తుపై గణనీయమైన ప్రభావం పడుతోందని.. ఇంధన సరఫరాకు అంతరాయం కలగడం వల్ల జీవన వ్యయం పెరుగుతుందని అన్నారు. అయినప్పటికీ ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుత సమయంలో అమెరికాతో కంటే సహచర ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు కలిగి ఉండడమే బ్రిటన్‌కు ప్రయోజనకరమని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## టారిఫ్‌ల రిఫండింగ్‌కు 45 రోజుల సమయం..!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు గతంలో తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో టారిఫ్‌ల రూపంలో వసూలు చేసిన 166 బిలియన్ డాలర్ల సొమ్మును తిరిగి ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ రిఫండింగ్ ప్రాసెస్‌కు సంబంధించి ఏర్పాటుచేసిన వ్యవస్థ దాదాపు పూర్తయిందని అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ సంస్థ పేర్కొంది. ఆ సంస్థ అధికారి బ్రాండన్ లార్డ్ అమెరికా అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానానికి ఈ విషయాన్ని వెల్లడించారు. కొత్త రిఫండ్ వ్యవస్థ ఏర్పాటు 80 శాతం పూర్తయినట్లు తెలిపారు. రిఫండ్‌లకు సంబంధించిన దరఖాస్తులను సమీక్షించి.. ప్రాసెస్ చేయడానికి 45 రోజుల సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. అయితే, దరఖాస్తుల స్వీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ప్రపంచదేశాలపై ట్రంప్ ఎడాపెడా




విధించిన సుంకాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో.. వాపసుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే, ఆ తర్వాత ఓ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా.. సుంకాల సొమ్మును వాపసు ఇవ్వాల్సిందేనని ట్రేడ్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దిగుమతిదారులు అందుకు అర్హులని పేర్కొంది.

## ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా.. ఖతార్, కువైట్‌పై డ్రోన్ దాడి



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రంగా మారుతున్నాయి. తాజాగా ఖతార్‌లోని దోహాకు సమీపంలో ఓ ట్యాంకర్‌పై గుర్తుతెలియని క్షిపణి దాడి చేసింది. ఈ మేరకు యూకే సముద్ర వ్యవహారాల అథారిటీ వివరాలు వెల్లడించింది. పోర్టు పక్కన నిలిచిఉన్న ఇంధన ట్యాంకర్‌పై జరిగిన దాడి కారణంగా నౌక ఎడమవైపు భాగం దెబ్బతింది. అయితే, దీనివల్ల చమురు లీకేజీకి, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగలేదని అథారిటీ పేర్కొంది. యుద్ధం మొదలైన నాటినుంచి అరేబియా గల్ఫ్, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌తో పాటు వాటి పరిసర ప్రాంతాల్లోని నౌకలే లక్ష్యంగా దాదాపు 26 దాడులు జరిగినట్లు యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది.

# చలికాలంలో ఊపిరితిత్తులను కాపాడుకోవడం ఎలా?




చలికాలం.. ఊరితిత్తులకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ ఊపిరితిత్తులను ఎలా కాపాడుకోవాలి? శ్వాస కోస వ్యాధులు రాకుండా ఎలా కాపాడుకోవాలో ఈ కథనంలో తెలుసుకుందాం. చలికాలంలో ఉష్ణోగ్రత తగ్గుముఖం పట్టడం వల్ల చాలా మందికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. చల్లని, పొడి గాలి, అలాగే వాతావరణ మార్పులు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. చల్లని గాలి మన ఊపిరితిత్తులలోకి ప్రవేశించినప్పుడు.. అది శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. దీని వల్ల దగ్గు, ఆస్తమా, బ్రాంకైటిస్ వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితులను ఎదుర్కోవటానికి జాగ్రత్తగా ఉండటం, సరైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల ప్రకారం.. శీతాకాలంలో చల్లని గాలి ఊపిరితిత్తులకు కష్టంగా ఉంటుంది. ఇది మన శ్వాస గొట్టాన్ని ఇబ్బందికి గురి చేస్తుంది. చల్లని, పొడి గాలి కూడా అలెర్జీలు, ఇన్ఫెక్షన్లను పెంచుతాయి.

### చలికాలంలో కాలుష్యం పెరగడమే అతిపెద్ద సమస్య..

చలికాలంలో బలహీనంగా మారిన ఊపిరితిత్తులపై మరింత ఒత్తిడి తెచ్చే పొగ, ధూళి కణాలు ఈ సమయంలో మరింత చురుగ్గా మారతాయి. ముఖ్యంగా ఉబ్బసం రోగులకు, చల్లని గాలి వారి లక్షణాలను మరింత తీవ్రతరం చేస్తుంది. చల్లటి, కలుషితమైన గాలిని పీల్చడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది మాత్రమే కాకుండా ఊపిరితిత్తులలో మంట, ఇన్ఫెక్షన్ కూడా వస్తుంది. ఇంతే కాకుండా.. శీతాకాలంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది . శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గి, సీజనల్ ఫీవర్, జలుబు వంటి సమస్యలు వస్తాయి.

### తీసుకోవాల్సిన చర్యలు..

ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. సమతుల్య ఆహారం తీసుకోండి. మిమ్మల్ని మీరు హైడ్రేట్ గా ఉంచుకోండి. హైడ్రేషన్ ఊపిరితిత్తులను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది శ్వాసను సులభతరం చేస్తుంది. దుమ్ము మరియు పొగకు దూరంగా ఉండండి. ఎవరైనా.. శీతాకాలంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ప్రారంభ చికిత్సతో తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. అంతే కాకుండా మీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దుమ్ము, పొగ నుంచి దూరంగా ఉండటం ముఖ్యం.



# పాలు మంచివేనా? ఉబకాయం ఉన్నోళ్లు తాగొచ్చా?



ఇటీవల ఉబకాయం అనే సమస్య చాలా మందిని వేదిస్తోంది. దీంతో ఏ ఫుడ్ తీసుకోవాలో.. ఏ ఫుడ్ తీసుకోవొద్దో తెలియక వారు తికమక పడుతున్నారు. అయితే ఇప్పటివరకు హెల్తీ అనుకున్న పాలు కూడా.. ఇప్పుడు అన్ హెల్దీ అన్న టాక్ వస్తోంది. ముఖ్యమంత్రి ఉబకాయం ఉన్నోళ్లు పాలు తాగొద్దని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

ప్రస్తుత కాలంలో చాలా మందిని కొవ్వు (కొలెస్ట్రాల్) సమస్య వేధిస్తోంది. దీని కారణంగా శరీర బరువు భారీగా పెరిగిపోతోంది. ఇలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారు ఏం తినాలన్నా, తాగాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంటారు. ఏం తింటే ఏమవుతుందో అనే భయంతో కొన్ని ఆహార పదార్థాలను తినడం, తాగడం మానేస్తున్నారు. ఈ లిస్టులో మొదటి స్థానంలో వచ్చేది పాలు.పాలు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఒకేసారి లభిస్తాయి. అందుకే రోజూ కనీసం ఒక గ్లాసు పాలు తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తారు. పాలు తాగడం వల్ల బలమైన ఎముకలకు అవసరమైన కాల్షియంను అందిస్తుంది. అంతే కాకుండా.. శరీరానికి కావాల్సిన అవసరమైన అనేక ఖనిజాలు, విటమిన్లు పాలలో నుంచి లభిస్తాయి. అయితే.. పాలు తాగితే బరువు పెరగడం కూడా ముడిపడి ఉంది. బరువు పెరుగుతుందనే భయంతో చాలా మంది పాలు తాగరు. అయితే పాలు తాగడం వల్ల ఊబకాయం పెరుగుతుందా..? అనే దానికి వివరాలు తెలుసుకుందాం... పాలలో పోషకాలతో పాటు, కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో.. అధిక మొత్తంలో పాలు తాగడం వలన ఊబకాయానికి దారి తీస్తుంది. అయితే, కొన్ని ప్రత్యేక విషయాలపై శ్రద్ధ పెడితే.. పాలు తాగితే బరువు పెరిగే ప్రమాదాన్ని సులభంగా తగ్గించుకోవచ్చు.

పాలు తాగడంవలన బరువు తగ్గే సరైన మార్గం ఏమిటి..?




మీరు మీ బరువును నియంత్రించుకోవడానికి పాలు తాగేటప్పుడు కేలరీలను తగ్గించాలి. అందు కోసం.. ఎక్కువ పరిమాణంలో పాలు తాగడం మానుకోండి. అంతే కాకుండా.. పాలలో కేలరీల పరిమాణాన్ని తగ్గించడానికి, మొత్తం పాలకు బదులుగా స్కిమ్డ్ మిల్క్ తీసుకోండి. అంటే.. పాల నుండి మీగడను పూర్తిగా తీసివేసి తాగండి. 1 గ్లాసు మొత్తం కొవ్వు పాలలో 146 కేలరీలు, కొవ్వు లేని పాలలో 86 కేలరీలు ఉంటాయి. ఈ క్రమంలో.. మీ అవసరాన్ని బట్టి సరైన పాలను తాగాలి. మీరు బరువు తగ్గించే డైట్‌లో ఉన్నట్లయితే.. మీ రోజువారీ కేలరీల కౌంట్‌ను దృష్టిలో ఉంచుకుని పాలను తీసుకోవాలి.

# కాజు హల్వా .. ఇలా ప్రిపేర్ చేసుకోండి.. !



దీపావళి పండగకు చాలా మంది స్వీట్స్ తింటూ ఉంటారు. అలాగే ఇంటికి వచ్చే అతిథులకు బహుమతిగా ఈ స్వీట్స్ ఇస్తూ ఉంటారు. దీనికోసం షాపుల నుంచి స్వీట్స్ తీసుకొని ఇస్తారు. కానీ ఈ దీపావళికి స్వీట్స్ బయటి నుంచి కాకుండా ఇంట్లోనే చేసి తినడడంతో పాటు, మీ ఇంటికి వచ్చిన అతిథులకు కూడా ఇస్తే చాలా బాగుంటుంది. అందుకే కాజు హల్వా అనేది బెస్ట్ ఆప్షన్ అని చెప్పుకోవచ్చు. యితే ఈ కాజు హల్వాను ఎలా చేసుకోవాలి, దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి, ఎలాంటి పద్ధతుల్లో హల్వా చేసుకుంటే రుచి అమోఘంగా వస్తుందనేది ఈ స్టోరీలో చూద్దాం.



| కాజు హల్వా తయారీకి కావాల్సిన పదార్థాలు |
|---|
| గోధుమ పిండి |
| కుంకుమ పువ్వు |
| జీడిపప్పు |
| పంచదార లేదా వీలైతే బెల్లం పొడి |
| నెయ్యి |
| యాలకుల పొడి |
| డ్రై ఫ్రూట్స్ |

**కాజు హల్వా తయారీ విధానం**

ఈ కాజు హల్వా తయారు చేయడానికి ముందుగా జీడిపప్పును మెత్తగా పొడి చేసుకొని పక్కకు పెట్టుకోవాలి. అనంతరం ఒక గిన్నె తీసుకొని అందులో నీళ్లు పోసి మరిగించండి. నీళ్లు మరిగాక అందులో పంచదార లేదా బెల్లం పొడి వేసి, మంటను హైలో పెట్టి అది కరిగేంత వరకు మరిగించుకోవాలి. ఆ సమయంలోనే అందులో యాలకుల పొడి, కుంకుమ పూల రేకులు వేసి కొంచెం సేపు మరిగించుకొని పక్కకు పెట్టుకోవాలి.అనంతరం మరొక గిన్నె తీసుకొని అందులో నెయ్యి వేసి.. అందులోనే గోధుమ పిండి, పిండిలా చేసుకున్న జీడిపప్పును వేయించాలి. ముఖ్యంగా మాడిపోకుండా చూసుకోవాలి. అనంతరం ఆ పిండిలో మనం ముందుగా చేసి పెట్టుకున్న పంచదార లేదా బెల్లం పొడితో చేసుకున్న పాకంను పోసి మెల్లమెల్లగా కలుపుకోవాలి. ఉండలు లేకుండా, మిశ్రమం దగ్గర పడే కొద్దీ కలుపుకుంటూ ఉండాలి. అనంతరం ఒక బౌల్‌లో ఆ హల్వాను వేసుకొని దానిపై కొన్ని డ్రై ఫ్రూట్స్ స్లైసెస్‌ను గార్నిష్ చేసుకుంటే సరిపోతుంది. దీపావళికి ఎంతో రుచికరమైన కాజు హల్వా సిధమైనట్లే.



# రిజ్వీ అద్భుత పోరాటం...

## లక్నో చేతుల్లోంచి గెలుపును లాగేసుకున్న ఢిల్లీ



లక్నో: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బుధవారం నాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేవలం 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన ఢిల్లీని, యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) తన అసాధారణ ఇన్నింగ్స్‌తో గెలిపించాడు. ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 119 పరుగులు జోడించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, టి. నటరాజన్ చెరో మూడు వికెట్లతో లక్నో పతనాన్ని శాసించగా, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 142 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లభించలేదు. కేఎల్ రాహుల్ (0), నితీశ్ రాణా (15), పతుమ్ నిస్సంక (1), కెప్టెన్ అక్షర్ పటేల్ (0) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ 4.3 ఓవర్లలో 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులో కలిసిన సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్ అద్భుతమైన పోరాటపటిమ కనబరిచారు. లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా రిజ్వీ తన క్లాస్ షాట్లతో అలరించి, ఒత్తిడిలోనూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో ఢిల్లీ మరో వికెట్ నష్టపోకుండా 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

# రెండ్రోజుల తర్వాత మళ్లీ కళకళలాడిన భారత స్టాక్ మార్కెట్లు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు భారీ లాభాలతో ముగిశాయి. గత రెండు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,186.77 పాయింట్లు లాభపడి 73,134.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 348 పాయింట్లు పెరిగి 22,679.40 వద్ద క్లోజ్ అయింది.

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశలతో మార్కెట్లు ఉదయం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. అయితే, సెషన్ చివరి గంటల్లో ఆ ఉత్సాహం కొంత తగ్గడంతో సూచీలు ఆరంభ లాభాల్లో కొంత భాగాన్ని కోల్పోయాయి. అయినప్పటికీ, చివరికి ప్లస్‌లోనే ముగియగలిగాయి. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మరింత మెరుగ్గా రాణించాయి.

నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.24 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 3.24 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా లాభపడింది. కెమికల్, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. అయితే, మార్కెట్ ట్రెండ్‌కు విరుద్ధంగా నిఫ్టీ హెల్త్‌కేర్, ఫార్మా రంగాలు నష్టాలతో ముగియడం గమనార్హం.

టెక్నికల్ అంశాలపై విశ్లేషకులు స్పందిస్తూ, నిఫ్టీ 22,500 స్థాయిని నిలబెట్టుకోకపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎగువన 23,000 స్థాయి కీలక నిరోధకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ల తదుపరి కదలికలు అమెరికా నుంచి వెలువడనున్న నాన్-ఫార్మ్ పేరోల్స్, నిరుద్యోగిత రేటు వంటి కీలక గణాంకాలపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# దేశమంతటా యూపీఐ సేవలకు తీవ్ర అంతరాయం..

## ఇబ్బందులు ఎదుర్కొన్న యూజర్స్




**న్యూఢిల్లీ:** దేశంలో డిజిటల్ చెల్లింపు సేవలకు బుధవారం తీవ్ర అంతరాయం ఏర్పడింది. యూపీఐ ప్లాట్‌ఫామ్స్ ద్వారా లావాదేవీలు చేసేందుకు ప్రయత్నించిన అనేక మంది వినియోగదారులు ట్రాన్సెక్షన్‌లు సరిగా జరుగక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవల్లో సమస్య ఎక్కువగా కనిపించింది. ఔటేజ్ ట్రాకింగ్ ప్లాట్‌ఫామ్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఒక్కసారిగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

ఒక్క ఎస్‌బీఐ ఖాతాదారుల నుంచే 500కు పైగా ఔటేజ్ రిపోర్టులు రాగా.. యూకో బ్యాంకుకు సంబంధించి దాదాపు 40 ఫిర్యాదులు నమోదయ్యాయి. న్యూఢిల్లీ, ముంబై, బెంగళూరు, జైపూర్, పుణె వంటి ప్రధాన నగరాలతోపాటు కోల్‌కతా, గువాహటి, చెన్నై నుంచి కూడా వినియోగదారులు లావాదేవీలు విఫలమయ్యాయని ఫిర్యాదులు వచ్చాయి. ఈ సమస్యపై చాలామంది ఎక్స్ వేదికగా తమ అసహనాన్ని వ్యక్తంచేశారు. కొందరి లావాదేవీలు మధ్యలోనే ఆగిపోగా, మరికొందరి యూపీఐ యాప్‌లు పూర్తిగా లోడ్ కాలేదు.

అయితే ఈ అంతరాయంపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందించింది. షెడ్యూల్ ప్రకారం చేపట్టిన నిర్వహణ పనుల సమయాన్ని ఏప్రిల్ 1వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటల వరకు పొడిగించినట్లు తెలిపింది. ఈ సమయంలో యూపీఐ, ఐఎంపీఎస్, యోనో, ఇంటర్నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్ సేవల్లో అంతరాయం కలుగవచ్చని పేర్కొన్నది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు యూపీఐ లైట్, ఈ-రూపీ (సీబీడీసీ) యాప్, ఏటీఎం సేవలను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచించింది.

# భారత ఉద్యోగులకు షాకిచ్చిన ఒరాకిల్..

## 12,000 మందిని తొలగింపు




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన టెక్ సంస్థ ఒరాకిల్ తమ భారతీయ ఉద్యోగులకు షాకిచ్చింది. దాదాపు 12,000 మందిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం లేనప్పటికీ 12,000 మంది ఉద్యోగుల్ని తొలగిస్తూ ఒరాకిల్ కార్పొరేషన్.. సిబ్బందికి మెయిల్స్ పంపినట్లు సమాచారం. అయితే, ఒరాకిల్ సంస్థ ఇండియానుంచే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్ని తొలగించాలని నిర్ణయించింది.

దాదాపు 30,000 మంది సిబ్బందిని తొలగించాలని నిర్ణయించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. సిబ్బందిని తగ్గించుకోవాలనే ప్రణాళికలో భాగంగా తొలగింపుల ప్రక్రియను కంపెనీ కొనసాగిస్తోంది. అయితే, విధుల నుంచి తొలగించనున్న ఉద్యోగులకు కంపెనీ ప్రత్యేక పరిహార ప్యాకేజీని అందించనున్నట్లు తెలుస్తోంది. వాలంటరీ రెసిగ్నేషన్ ఇచ్చిన వారికి అదనపు శాలరీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ వంటివి కంపెనీ అందించనుంది. సంస్థలో ఒక ఏడాది పూర్తి చేసుకున్నవారికి 15 రోజుల వేతనం అందించనుంది. అలాగే, నోటీస్ పీరియడ్‌కు అనుగుణంగా ఒక నెల వేతనం అందుతుంది. గరిష్టంగా ఉద్యోగులకు అదనంగా రెండు నెలల వేతనం అందించనుంది.

సంస్థాగత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ తొలగింపులు చేపట్టినట్లు ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో కంపెనీ తెలిపింది. ఒరాకిల్ సంస్థకు ఇండియాలో 30,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇతర దేశాల్లోనూ మరికొందరు ఉద్యోగుల్ని నెలలోపే తొలగించాలని నిర్ణయించింది. ఇటీవల ఓపెన్‌ఏఐ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం కారణంగా ఒరాకిల్ సంస్థ ఉద్యోగుల్ని తొలగిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

# ఐపీఎల్‌లో డబ్బులు రావు.. అందుకే ఆడట్లేదు: ఆడమ్ జంపా




**సిడ్నీ:** ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు.

ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. "ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు" అని జంపా వివరించాడు.

గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు.

పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# స్లో ఓవర్ రేట్.. శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల ఫైన్



**ముల్లాన్‌పూర్:** ఐపీఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో విక్టరీ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి 12 లక్షల ఫైన్ వేశారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద ఈ సీజన్ తొలి నేరంగా పరిగణిస్తూ .. స్లో ఓవర్ రేటు కింద అయ్యర్‌కు జరిమానా విధిస్తున్నట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది.

ముల్లాన్‌పూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ షోతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తుచేసి విజయంతో టైటిల్ వేటను మొదలెట్టింది పంజాబ్ జట్టు. గిల్ సేన నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన కింగ్స్.. 19.1 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి గెలుపు బోణీ కొట్టింది. ఈ లీగ్‌లో అరంగేట్ర మ్యాచ్ ఆడిన కూపర్ కనోలి (44 బంతుల్లో 72 నాటౌట్, 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధశతకానికి తోడు ప్రభ్‌సిమ్రన్ సింగ్ (24 బంతుల్లో 37, 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించారు. పంజాబ్ ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టైటాన్స్.. బ్యాటర్ల వైఫల్యంతో 20 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 162 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ గిల్ (27 బంతుల్లో 39, 6 ఫోర్లు), జోస్ బట్లర్ (33 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్) మినహా మిగిలినవారంతా తేలిపోయారు.

# భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు..

## షెడ్యూల్ విడుదల



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు ఇవాళ అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి.

ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది.

ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. "భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది" అని వివరించారు.

ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం. చివరిసారిగా 2002 మార్చిలో జింబాబ్వే భారత్‌లో పర్యటించింది.

ఈ సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో పర్యటించడంపై మకోనీ సంతోషం వ్యక్తం చేశారు. "రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించడం ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మా ఆటగాళ్లకు దక్కిన గౌరవం, విలువైన అవకాశం. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మా జట్టుకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

## బిజీ షెడ్యూల్ వల్లనే డ్రాగన్‌లో నటించలేకపోయా

**మలయాళ నటుడు టొవినో థామస్ వెల్లడి**



**టాకీస్:** టాలీవుడ్ హీరో ఎన్టీఆర్‌- కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ పాత్ర కోసం మలయాళ నటుడు టొవినో థామస్‌ని చిత్ర బృందం ఎంపిక చేయనున్నట్లు ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. వీటిపై టొవినో స్పందించారు. తన కొత్త సినిమా 'పళ్లిచట్టంబి' ప్రమోషన్స్‌లో భాగంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో క్లారిటీ ఇచ్చారు. మలయాళంలో వేరే సినిమాలు చేస్తుండటంతో.. డేట్స్ సర్దుబాటు కాక 'డ్రాగన్'లో నటించట్లేదని తెలిపారు. ' తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. మలయాళంలో వర్కింగ్ కల్చర్ టాలీవుడ్‌కు భిన్నంగా ఉంటుంది. తక్కువ సమయంలోనే షూటింగ్ పూర్తి చేస్తాం. తెలుగు చిత్రాల షూటింగ్ షెడ్యూల్స్ ఎక్కువ ఉంటాయి. పైగా ఒకేసారి రెండు/మూడు చిత్రాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. ఒక సినిమా పూర్తయ్యాకే మరో సినిమా చేస్తుంటా. ఒకవేళ నేను టాలీవుడ్‌లో ఓ పెద్ద సినిమాలో నటిస్తే.. నేను అంగీకరించిన మూడు/నాలుగు మలయాళ చిత్రాలపై ప్రభావం పడుతుంది. అందుకే తెలుగు సినిమాల్లో నటించలేకపోతున్నా' అని వివరించారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన 'పళ్లిచట్టంబి' ఏప్రిల్ 10న తెలుగులోనూ విడుదల కానుంది.

## సెట్స్‌లో నటి పట్ల అసభ్య ప్రవర్తన

**మలయాళ దర్శకుడు రంజిత్ అరెస్ట్**



**టాకీస్:** ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌ను లైంగిక వేధింపుల ఆరోపణలపై కొచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. ఒక యువ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎర్నాకుళం సెంట్రల్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఒక సినిమా సెట్‌లో రంజిత్ తనతో అనుచితంగా ప్రవర్తించారని ఇటీవల ఓ నటి ఫిర్యాదు చేసింది. ఈ ఆరోపణల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ప్రాథమిక విచారణ కోసం కొచ్చికి తరలించారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడానికి ముందు, చిత్ర యూనిట్‌లోని అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేశారు. కమిటీ సభ్యులు దానిని పరిశీలించి, అది తీవ్రమైన అంశంగా గుర్తించడంతో తదుపరి చర్యల కోసం కేసును కేరళ పోలీసులకు బదిలీ చేశారు. హేమ కమిటీ నివేదిక వెలువడిన తర్వాత మలయాళ సినీరంగంలో బయటపడుతున్న వరుస వేధింపుల కేసుల్లో ఇది మరొకటి కావడం గమనార్హం. గతంలోనూ రంజిత్‌పై ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. 2024లో బెంగాలీ నటి చేసిన వేధింపుల ఆరోపణల వల్ల ఆయన తన కేరళ చలనచిత్ర అకాడమీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.



MOVIE TIME

## ఐదు భాషల్లో ఫుల్ బిజీగా ఉన్న లేడీ సూపర్ స్టార్

**టాకీస్:** నయనతార.. ఈ స్టార్ హీరోయిన్ కు లేడీ సూపర్ స్టార్ అనే బిరుదు ఉంది. బాలీవుడ్‌లోనూ ఈ బ్యూటీకిడిమాండ్ పెరిగింది. షారుఖ్ 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఈ అమ్మడు. తొలి సినిమాతోనే బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకుంది. నయనతార అసలు పేరు డయానా మరియం కురియన్. 2003లో 'మనసీనక్కరే' అనే మలయాళ చిత్రంతో సినీ ప్రయాణం మొదలుపెట్టింది. మలయాళంలో కొన్ని సినిమాలు చేసిన తర్వాత తెలుగు, తమిళ చిత్రాల వైపు అడుగులేసింది. 'అయ్యా' ఆమె తొలి తమిళ చిత్రం. 2011లో 'శ్రీరామరాజ్యం' సినిమాలో ఆమె నటనకుగాను ఫిలింఫేర్ అవార్డు ఆడుకుంది. 2011కి ముందు నయనతార క్రిస్టియన్. 2011లో క్రిస్టియన్ మతాన్ని విడిచిపెట్టి హిందూ మతాన్ని స్వీకరించింది. నయనతార 2022లో దర్శకుడు విఘ్నేష్ శివన్‌ని పెళ్లాడింది. ఆ తర్వాత సరోగసీ ద్వారా ఇద్దరు తల్లిదండ్రులు అయ్యారు. వీరికి కవలలు. ప్రస్తుతం సౌత్ లో అత్యంత రెమ్యునరేషన్ తీసుకుంటుంది నయనతార. ఒక్కో సినిమాకు 20 నుంచి 25 కోట్ల రూపాయలు వసూల్ చేస్తుంది. రీసెంట్ డేస్ లో నయన్ సినిమాల స్పీడ్ పెంచేసింది. తెలుగు తమిళ్, హిందీ సినిమాల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది ఈ చిన్నది. అలాగే మలయాళంలోనూ సినిమాలు చేస్తుంది. ఇప్పటికే రెండు సినిమాలను లైనప్ చేసింది. ఇక ఇప్పుడు కన్నడ భాషలోనూ నటిస్తుంది. ఇలా ఐదు భాషల్లో నటిస్తూ యమా బిజీగా ఉంది ఈ అందాల తార.

## మళ్లీ రాణిగా రాబోతున్న కంగనా..

**త్వరలోనే 'క్వీన్ 2' షురూ!**



**టాకీస్:** బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ కంగనా రనౌత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచిన చిత్రం 'క్వీన్'. వికాస్ బల్ దర్శకత్వంలో 2013లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా కంగనాకు నేషనల్ అవార్డును తెచ్చిపెట్టింది. ఒక సాధారణ అమ్మాయి తన పెళ్లి రద్దయ్యాక ఒంటరిగా హనీమూన్‌కు వెళ్లి, అక్కడ తనను తాను ఎలా ఆవిష్కరించుకుంది అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. అయితే తాజాగా ఈ సూపర్ హిట్ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు బాలీవుడ్ మీడియా వర్గాల నుంచి వార్తలు వస్తున్నాయి.

తాజాగా రాబోతున్న ఈ సీక్వెల్‌లో కంగనా రనౌత్ మరోసారి 'రాణి' పాత్రలో అలరించడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. మొదటి భాగంలో రాణి ప్యారిస్, ఆమ్‌స్టర్‌డ్యామ్ వంటి యూరప్ నగరాల్లో పర్యటిస్తే, ఈ 'క్వీన్ 2' చిత్రంలో ఆమె ప్రయాణం మన దేశంలోని వివిధ మెట్రో నగరాల చుట్టూ సాగనుందని బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం. మొదటి భాగాన్ని అద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు వికాస్ బహ్ల్ ఈ సీక్వెల్‌కు కూడా దర్శకత్వం వహించబోతున్నారు. ఈ సినిమాలో కంగనా మినహా పాత నటీనటులు ఎవరూ ఉండరని, ఎక్కువ శాతం కొత్త థియేటర్ ఆర్టిస్టులను ఎంపిక చేసుకుంటున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న కంగనా ఈ సినిమా షూటింగ్ కోసం ప్రత్యేకంగా డేట్స్ కేటాయించినట్లు సమాచారం. ముంబైలో వేసిన ప్రత్యేక సెట్‌లో ఏప్రిల్ నెలాఖరు నుంచి షూటింగ్ ప్రారంభం కానుందని, దాదాపు మూడు నెలల్లోనే ఈ సినిమాను పూర్తి చేసేలా చిత్ర యూనిట్ ప్రణాళికలు సిద్ధం చేయబోతున్నట్లు టాక్.

## 3కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసిన ధురంధర్-2

టాకీస్: రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ.1400 కోట్ల మార్కును



దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ.899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ.900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ.170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.

## 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ

టాకీస్: తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ




చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.